# అభినందన

‘‘అమ్మా... నేను బయలుదేరుతున్నానూ...’’ అని చెప్పిన వందన వైపు కౌసల్య చురచుర చూసింది. “బ్యాంకుకి వెళ్ళి నీ పని నువ్వు చూసుకుని వచ్చేయి. తెలిసిందా... అనవసరమైన పనులన్నీ నెత్తికి ఎక్కించుకోకు...” కూతురుతో కటువుగానే అందావిడ.

వందన నిట్టూర్చింది. “ఇంకో మూడు నాలుగు రోజులు గడిస్తే... ఆ పనే చేస్తాను! ఇప్పుడు మాత్రం ‘నా డ్యూటీ నాది’ అనుకుని ఉండలేకపోతున్నానమ్మా....! ”

“ఉండాల్సిందే...! ఇలాంటి గడ్డుకాలం దాపురిస్తుందని ఎవరమైనా ఊహించామా...?! ఉద్యోగమంటే తప్పనిసరిగానీ, అలా ఊళ్ళు పట్టుకుని తిరగటం మాత్రం బాగాలేదు!” నిష్కర్షగా అంది కౌసల్య.

బేలగా తల్లివైపు చూసింది వందన.

“నువ్వన్నట్లే... ఇది కనీవినని గడ్డుకాలం కాబట్టే... నాలాంటి వాళ్ళు చేయగల సహాయం చేయాలి! నిజానికిది సాయం కానే కాదు, నా డ్యూటీలో భాగమే...!”

కౌసల్య కోపం పెరిగిపోయింది. “ఏమిటే మాటిమాటికీ డ్యూటీ అంటావు...! నీ ఆఫీసువాళ్ళు అలా వూళ్ళు తిరిగి అందరికీ డబ్బు చేరవేయమని చెప్పలేదుగా... నీ అంతట నువ్వుగా కల్పించుకుని చేస్తున్న పనికి అదనంగా ఏమీ ఉండదు. జీతమూ పెంచరు... ప్రమోషనూ ఇవ్వరు...!ఎగిరెగిరి దంచినా, మామూలుగా దంచినా ఒకటే కూలీ! అది తెలుసుకో....!”

తల్లి మాటలకు వందన నిర్లిప్తంగా చూసింది. “నాకూ ఆ విషయం తెలుసమ్మా.. ఎవరి మెప్పూ నేను కోరుకోవటం లేదు. నేను చేస్తున్న ఉద్యోగానికి జీతం ఇస్తున్నారుగా, అది చాలు!”

“అవునుగానీ, ప్రభుత్వమే బయటకు అనవసరంగా రావద్దని ఆంక్షలు పెడుతోందా... నీకేదైనా వస్తే... బాధపడేది ఎవరూ... మేమేగా...!” నిష్ఠూరం ధ్వనించిందామె కంఠంలో.

వందన ఆమె మాటల్ని అంగీకరిస్తున్నట్లుగా తలవూపింది. “నిజమేనమ్మా. ప్రభుత్వం చెబుతున్నట్లుగా నేనూ అన్ని జాగ్రత్తలూ పాటిస్తున్నాను. ఈ కరోనాకి భయపడి అందరూ ఇంట్లో కూర్చుంటామంటే ఎలా...? అందరి అవసరాలూ ఎలా తీరతాయి...? కొందరమైనా జాగ్రత్తలు తీసుకుని పనులు చేయాల్సిందే...! అందుకే నేనూ...” అంటూ వందన మాటలు ఆపేసింది.

“నేనెంత చెప్పినా నీ చెవికి ఎక్కదు...! నీ మాటే నీది....!” అంది కౌసల్య ఆవేశంగా.

“ఒక్క మాట నిన్ను అడగనా అమ్మా…!” అంది వందన తల్లి వైపు చూస్తూ.

ఆవిడ ఏమిటన్నట్లు చూసింది.

“మన పక్క పోర్షన్ లో ఉండే గోవిందరావు అంకుల్ కి నువ్వు రోజు టిఫిన్స్, కూరలూ ఎందుకిస్తున్నావ్….?”

“అదేం మాటే…?” అంటూ ఆవిడ వందన వైపు చూసింది.

“ఆయన నన్ను ‘చెల్లెమ్మ’ అంటూ ఎంత అభిమానం చూపిస్తారూ…! మన పెరట్లో పండుతున్న కూరగాయలన్నీ అన్నయ్య పెంచిన మొక్కలవే కదా…! సుభద్ర వూరుకెళ్ళి, రాకపోకలు లేకపోవటం వలన రాలేకపోయింది కదా, అందుకని అన్నయ్య ఇబ్బంది పడకుండా, మన పట్ల ఎంతో అభిమానం చూపించే ఆయనకు ఆ మాత్రం ఇవ్వటం మన ధర్మం! ఆవిడ వచ్చేక మనం ఏమీ చేయనక్కర్లేదు… అసలు ఆయన ‘ ఏదోలా తనే చేసుకుంటానన్నా, మీకోసం మేం ప్రత్యేకంగా చేస్తున్నదేం లేదు, సుభద్రవచ్చేవరకూ అంతేకదా…’ అని నేనే ఒప్పించాను! ఇలాంటి సమయాల్లో ఇరుగూ పొరుగూగా ఆమాత్రం సాయాలు చేసుకోకపోతే ఎలా…?”

తల్లి మాటలకు “అవునమ్మా… నువ్వు చెప్పింది చాలా నిజం…” అంటూ వందన చిరునవ్వుతో తలవూపి అంది.

“మరి నేను చెప్పిందీ, చేస్తున్నదీ అదే కదమ్మా… అవసరానికి ఇతరులకు చేయగలిగే సాయం చేయకుండా ఉండలేకపోవటమనేది నాకు నాన్నా, నీ దగ్గర్నుండే వచ్చింది! అసలు మిమ్మల్ని చూసే నేనూ నేర్చుకున్నానేమో….!

మామయ్య తను చేయగల సాయం మనకు చేస్తూనే ఉంటారు! మీరూ అంతే! ఇరుగూ పొరుగుతో ఇలా ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం తప్పనిసరి! స్నేహబంధం బలీయమౌతుంది, కేవలం వస్తువులే కానక్కర్లేదు, అభిమానాలు, ఆప్యాయతలు అన్నీ….!

నాన్న రిటైరవ్వకముందు ఆ బ్యాంకులోనే పనిచేశారు కదా, అప్పుడేగా, నాకూ ఈ చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పరిచయం ఏర్పడిందీ…! వాళ్ళంతా నాన్న చేసిన సాయాల్ని గుర్తు పెట్టుకుని… ఎంత అభిమానం చూపిస్తారో…! నాన్న వాళ్ళందరితో ‘నా ఉద్యోగ బాధ్యతగా చేస్తున్నానంతే, ప్రత్యేకించి నేను చేస్తున్నదేం లేదూ’ అని చెప్పటం నాకు గుర్తు ఉంది! ఇది నీకూ తెలుసు! నాన్న వాళ్ళ దగ్గర్నుండి ఏమి ఆశించకపోవటం వలనేగా అంతటి ఆపేక్షనూ, గౌరవాన్నీ చూపిస్తారూ…! అలాంటి గౌరవాభిమానాలు చాలవా… ఇంకేం కావాలీ!’’ అనడిగింది వందన.

కౌసల్య నిట్టూర్పు ‘‘నీతో వాదన పెట్టుకోలేను... సరే, జాగ్రత్తగా వెళ్ళి రా...” అంది. వందన చిరునవ్వుతో తన లాప్ టాప్, మాస్క్ వగైరాలన్నీ సరిచూసుకుని బయలుదేరింది.

* * *

కరోనా వల్ల ఆ చుట్టు ప్రక్కల వూళ్ళ వాళ్ళు బయటకు రాలేకపోతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న చిన్న సాయం సంగతీ వాళ్ళకు తెలియదు. అందుకనే బ్యాంకులో పనిచేస్తున్న వందన పర్మిషన్ పొంది, క్యాష్ బ్యాగు, లాప్ టాప్ తో తన బండి మీద వెళ్ళి... ఒకచోట కూర్చుని వూరు వాళ్ళందరికీ సమాచారం ఇచ్చి... వాళ్ళ అవసరాలకి ప్రభుత్వం ప్రకటించి**న** సాయాన్ని అందించి... **వాళ్ళ** దగ్గర్నుండి, సంతకాలూ, వేలిముద్రలూ తీసుకుని అన్నీ బ్యాంకులో అప్పచెప్పి ఇంటికి వస్తుంటోంది నాలుగైదు రోజులుగా.

‘అసలే కాలం బాగాలేదు, ఆ కరోనా అంటుకుంటే ఎలా’ అని కౌసల్య ఆందోళన. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే తప్ప.. బాధ్యతలనుండి తప్పించుకోవటం సరికాదని వందన వాదన.

నాలుగు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన వందనలోని ఆ**నం**దాన్ని గమనించిన కౌసల్య అడిగింది. ‘‘ఏం జరిగిందేమిటీ, అంత ఆనందంగా ఉన్నావ్....’’

పక్కంటి **గోపాలరావు**, తల్లీ తండ్రీ అందరూ ముందు వరండాలోనే దూరం దూరంగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ సమయంలోనే ఇంటికి వచ్చిన వందనను చూసి కౌసల్య అలా అడిగింది. ‘‘ఒక్క ని**మిషం**...’’ అంటూ లోపలకు వెళ్ళి శుభ్రంగా స్నానం చేసి పది నిముషాలలో వచ్చి వాళ్ళ దగ్గర కూర్చుంది.

‘‘ఏమిటమ్మా... ప్రమోషన్ ఏమైనా వచ్చిందా...?’’ తండ్రి ప్రశ్నకు వందన ‘‘అంతకంటే ఎక్కువే నాన్నా....’’ అంటూ తన హ్యాండ్ బ్యాగ్లోని ఓ కవరు అందించింది.

అందరికీ తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది.

ఆ కవరును అటూ ఇటూ తిప్పి చూసి ‘‘నీకు ఎవరు రాసిన ఉత్తరం...?’’ అనడిగాడాయన.

‘‘మీరు పైకి చదవండి అంకుల్... అందరూ వింటారు... విషయం తెలుస్తుంది’’ అంటూ కవరులోని కాగితాల్ని **గోపాలరావు** కి అందించింది వందన.

ఆయన చదవటం మొదలు పెట్టాడు.

‘‘మేడమ్...

నా పేరు కామేశం అండి.  ఊళ్ళో ఇంటరు చదువుతున్నాను. మీకీ ఉత్తరం రాయాల్సి వచ్చిన అవసరం ఏమిటో మీకు అంతా చదివాకనే అర్ధమౌతుంది.

ఈ కరోనా వలన మా గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో మీకు బాగానే తెలుసు కదండీ! చేయటానికి పనులు లేవు, తినటానికి తిండీ లేదు! అప్పు పుట్టే పరిస్థితి అసలే లేదు, ఏమైనా ఉంటేనే గదా, బదుళ్ళు ఇవ్వగలిగేది...!

ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో... మా ఊరుకో దేవదూత లాంటి అమ్మాయి వచ్చిందండీ! అది మీరేనని మీ కర్థమయ్యే ఉంటుంది.

మీరు వచ్చి మీ సరంజామా అంతా పరుచుకుని ఒక చోట కూర్చుని అక్కడే తచ్చాడుతున్న నాకు 'ఊళ్ళోకి వెళ్ళి... ప్రభుత్వం సాయంగా కొంత డబ్బు మీ ఖాతాల్లో జమ చేసింది కాబట్టి వచ్చి తీసుకోమని అందరకూ చెప్పిరా...' అంటూ ఓ పని పురమాయించారు.

నేను ఊళ్ళోకి బాణంలో దూసుకుపోయాను. ఈ మాట చెప్పగానే తిండీ తిప్పలకు మొహం వాచి ఉన్న మా ఊరువాళ్ళందరికీ పండగ వచ్చినట్లయిందండీ! పరుగు పరుగున వచ్చి మిమ్మల్ని చుట్టు ముట్టారు. మీరు అందర్నీ కూర్చోబెట్టి డబ్బు ఇచ్చి... వేలిముద్రలు తీసుకున్నారు!

మేడమ్... మీకో రెడు మాటలు చెప్పాలని బాగా అనిపిస్తోంది. మా ఊళ్ళోని ఏ ఒక్కరి పరిస్థితే కూడా మెరుగ్గా లేదు! అందరిదీ ఒకే సమస్య! భయంకరమైన ఆకలి భూతం! ధాన్ని హతమార్చే దారి కనుపించక .... చిన్నా పెద్దా అందరూ తల్లడిల్లటమే....!

రోదన వల్ల ఆకలి తీరే మార్గం లేదని పిల్లలకు తెలిసిపోయింది! పిల్లల ఆకలి తీర్చలేని దౌర్భాగ్యానికి కుమిలిపోయే వేదనే పెద్దలకు మిగిలింది! అలాంటి సమయంలో మీరు వచ్చి అందించిన గోరంత సాయమే మా అందరికీ కొండంత బలాన్నిచ్చింది! ఎక్కడికో పనులకోసం **వలసు** వెళ్ళిన కొడుకులు తిరిగి వచ్చే దారిలేక అక్కడే చిక్కడిపోతే, వృద్ధులు మనవల్ని ముందు పెట్టుకుని ఆకలి చూపులతో వాళ్ళకోసం ఎదురు తెన్నులు **చూ**సే పరిస్థితేనండి ప్రతీ ఇంట్లో.

ఇక విషయం చెబితే మీకు మా పరిస్థితి బాగా అర్థమౌతుందేమో...! మీరు చెప్పమన్న విషయాన్ని అందరికీ చాటింపువే**సి** చెబుతున్నట్లుగా అరిచి చెబుతూనే కమలక్క అనబడే మా దూరపు బంధువుల ఇంటికీ వెళ్ళాను. మాటిమాటికీ ఇద్దరు చిన్న పిల్లలు ఆకలని అమ్మను అడిగినా ప్రయోజనం లేదని తెలిసి మాటిమాటికీ వెళ్ళి పొయ్యిని చూసి వస్తున్నారట! ఇది చూసి కొంగు నోట్లో కుక్కుకుని నేలపై బోర్లా పడుకుని కమలక్క కుమిలి కుమిలి ఏడుస్తోందమ్మా. నేనీ కబురు చెప్పగానే దొర్లి దొర్లి కన్నీళ్ళు కారుస్తున్నదల్లా లేచి నిలబడి పరుగెట్టబోయి బోర్లా పడిపోయింది కూడానమ్మా. నేను లేపి చెయ్యి వూతం ఇస్తే పడ**తా** లేస్తా ఎంత ఇదిగా వచ్చిందనుకున్నారూ....? పిల్లలకి ఇంత **తిండి** పెట్టి ఆకలి తీర్చగలిగే మార్గం కనుపించటంతో ఆనందంతో తబ్బిబ్బు అయి పోయిందమ్మా.

మా కెవ్వరికీ విషయం తెలియక, బ్యాకుం దగ్గరకు రాలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిసీ... మీరే వచ్చి స్వయంగా ఆ సాయాన్ని అందజేస్తున్నారనే వార్తకు... ఆనందపడటమే కాదు, **మిమ్మల్ని** ఎన్నిసార్లు ఎంతగా దీవించిందో చెప్పలేను.... మా ఊరు ప్రజలందరూ మనసులోనే మీకు కృతజ్ఞతగా ఎన్నెన్ని దండాలు పెట్టుకున్నారో కూడా వివరించలేనండీ!

మా ఊరు వాళ్ళందరూ ఒకచోట చేరి, ఈ రోజు నాతో ఈ ఉత్తరం రాయిస్తున్నారమ్మా. మీకు కృతజ్ఞతలు చెప్పుకుని... **వాళ్ళ** దీవెనలూ అందజేయటానికే **ఈ ఉత్తరం** ! నేను సరిగా చెప్పలేకపోయానేమోగానీ, మీకు అర్థం అవుతుందని అనుకుంటున్నానండీ!

ఇక ముగిస్తానండీ.

గ్రామ ప్రజలందరి తరుపునా మా మనోభావాలు మీకు తెలియజేస్తున్న - కామేశం.

చదవటం ముగించి **గోపాలరావు** కళ్ళతోనే తన ప్రశంసలు వందనకు తెలియజేశారు. తల్లీ తండ్రీ వందన దగ్గరకు వచ్చి అక్కున చేర్చుకున్నారు మెచ్చుకుంటున్నట్లుగా. **కౌసల్య** చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంది. ''వందనా... నువ్వు చేస్తున్న మంచి పనిని గుర్తించలేక వెనక్కి లాగాలని ప్రయత్నించాను! తల్లిగా **నా స్వార్థం నాది** ! కానీ... నువ్వు తల్లి మనసుతో ఎందరికో సాయం అందించి... అసలైన అమ్మ మనసు నీదని నిరూపించుకున్నావు! నిజమే **వందనా...** ఇది ఎన్నో అవార్డులు, రివార్డులు కన్నా గొప్ప ఉత్తరం! నిస్సహాయులకు నిస్వార్థంగా సాయం చేయటం చాలా గొప్ప విషయం!'' అంది కౌసల్య గద్గద స్వరంతో.

* * *